నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ గురువారం 27 జూన్ 2024 | ADILABAD NIRMAL

## ప్రైవేట్ బస్సులు సీజ్

ఎదులాపురం, జూన్ 26 : నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న మూడు ప్రైవేటు బస్సులను ఆర్టీవో అధికారులు సీజ్ చేశారు. జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ ఆదేశాల మేరకు బుధవారం ఉదయం ఆదిలాబాద్‌లో తనిఖీలు చేపట్టారు. బస్సులో సరుకులను సరఫరా చేయడంతో డైమండ్, మెట్రో, సహార బస్సులను సీజ్ చేసినట్లు ఏఎంవీఐ హరీంద్రకుమార్ తెలిపారు. సీజ్ చేసిన బస్సులను ఆర్టీసీ డిపోలో పెట్టామని తెలిపారు.



సీజ్ చేసిన ప్రైవేట్ బస్సులతో ఏఎంవీఐ హరీంద్రకుమార్

## కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

తాంసి(భీంపూర్), జూన్ 26 : భీంపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ ప్రతినిధులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి చేరుతున్నారన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సుధాకర్, వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, బీఆర్ఎస్ నాయకులు సంజీవ్‌రెడ్డి, ప్రణీత్‌రెడ్డి, సంతోష్, కల్చప్ యాదవ్ పాల్గొన్నారు.


కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# నేతల పుట్టిల్లు బీఆర్ఎస్

### రాజకీయ నాయకుల తయారీ ఫ్యాక్టరీగా గులాబీ పార్టీ

- వేల సంఖ్యతో ద్వితీయ.. లక్షల సంఖ్యలో తృతీయ స్థాయి నాయకత్వం
- ఉమ్మడి జిల్లాలో అన్ని స్థాయిల్లోనూ ఎదిగిన నేతలు అనేకం
- కొందరు పార్టీ మారితే నష్టం లేదు.. ప్రత్యామ్నాయానికి కొదవ లేదు..




*రాజకీయ నాయకుల తయారీ ఫ్యాక్టరీగా బీఆర్ఎస్ పార్టీ విరాజిల్లుతున్నది. ప్రత్యేక తెలంగాణ సాధనే లక్ష్యంగా ఏర్పడిన బీఆర్ఎస్ పార్టీలో ఆది నుంచి కొత్త నాయకత్వం పుట్టుకొస్తూనే ఉన్నది. ఉద్యమ సమయంలో సమైక్య పాలకులు ఎన్ని కుట్రలు చేసినా, ప్రలోభపెట్టి పార్టీ ఫిరాయింపులు చేసినా ప్రత్యామ్నాయం సృష్టించుకుని నిలదొక్కుకున్న పార్టీగా గుర్తింపు ఉన్నది. పార్టీ ఏర్పడిన నాటి నుంచి నేటి దాకా ఎదురుదెబ్బలు తగిలినా ముందుకు వెళ్లడం తప్పా వెనక్కి చూసుకోవడం బీఆర్ఎస్‌కు, కేసీఆర్‌కు అలవాటు లేదు. రాష్ట్రం సాధించుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందరో నాయకులు చేరారు. పార్టీ అవసరాలు, ఆ నాయకుల అనుభవంతో పార్టీకి ఉన్న అవసరాన్ని గుర్తెరిగి కేసీఆర్ అందరినీ పార్టీలోకి ఆహ్వానించారు. వీరిలో తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలుపొందిన వారు ఎందరో ఉన్నారు. ఉద్యమంలో పాల్గొన్న నాయకులు, ఉద్యమకారులు, విద్యార్థి, ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాల నాయకుల నుంచి వచ్చిన వారెందరికో గులాబీ పార్టీ అవకాశాలు కల్పించింది. ఇలా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఎంతో మంది నాయకులను తయారు చేసింది బీఆర్ఎస్.*

*- మంచిర్యాల, జూన్ 26(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

### నిప్పు కనికల్లాంటి నాయకులు ఎందరో..

తెలంగాణ ఉద్యమంలో చేసిన పోరాటాన్ని గుర్తుంచుకుని విద్యార్థి నాయకుడైన బాల్క సుమన్‌కు సీఎం కేసీఆర్ పెద్దపల్లి ఎంపీ టికెట్ ఇచ్చారు. ఉస్మానియా క్యాంపస్‌లో ఉదయించిన ఆ యువ కిరణానికి రాజకీయ దిశానిర్దేశం చేశాడు. పెద్దపల్లి ఎంపీగా, చెన్నూర్ ఎమ్మెల్యేగా రెండు సార్లు అవకాశాలు ఇచ్చి గెలిపించుకున్నారు. బాల్క సుమన్‌ను వెన్నంటే ఉంచుకుని కాపాడుకున్నారు. ప్రభుత్వ విప్ పదవి ఇచ్చి దళితనాయకుడికి పెద్దపీట వేశారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు కూడా 2014 సంవత్సరంలో ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించింది బీఆర్ఎస్ పార్టీయే. పార్టీలో చేరిన తర్వాతనే ఎమ్మెల్యేగా గెలుపొందారు. బోథ్ ఎమ్మెల్యేగా ఉన్న అనిల్ జాదవ్ తన ప్రస్తానాన్ని బీఆర్ఎస్ పార్టీలోనే ప్రారంభించారు. జడ్పీటీసీగా ఉన్న యువనాయకుడి కష్టాన్ని గుర్తించి మొన్నటి ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి దగ్గరుండి గెలిపించుకున్నారు. ఖానాపూర్ నుంచి మరో యువ నాయకుడు జాన్సన్ నాయక్‌ను వెలుగులోకి తీసుకొచ్చింది బీఆర్ఎస్ పార్టీ. విదేశాల్లో వ్యాపారాలు కలిగిన ఆయనలోకి సేవ భావాన్ని గుర్తించి రాజకీయాల్లోకి ఆహ్వానించింది. ఎన్నో ఏండ్లుగా వెనుకబడిన మారుమూల ప్రాంతంగా, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఖానాపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశాన్ని ఇచ్చింది. తృటిలో ఓటమి పాలైనా.. ఖానాపూర్ నియోజకవర్గానికి మాత్రం ఓ మంచి నాయకుడిని అందించింది. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మికి బీఆర్ఎస్ పార్టీనే పుట్టినిల్లు. ఆమె ఎమ్మెల్యేగా, జడ్పీ చైర్‌పర్సన్‌గా, రెండోసారి ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ పార్టీ నుంచే గెలుపొందారు. ఆదివాసీ బిడ్డకు రాజకీయ ఓనమాలు నేర్పించి జిల్లాలోనే తిరుగులేని నాయకురాలిగా మలిచింది. ఉద్యమ కాలంలో వెన్నంటి నడిచిన రేణికుంట్ల ప్రవీణ్‌కు ఉద్యమ నాయకుడి హోదాలో పదవులు కట్టబెట్టింది. వీరితోపాటు ద్వితీయ శ్రేణి నాయకులు, వందలాది మందిని బీఆర్ఎస్ తయారు చేసింది. ఎన్నిక ఏదైనా టికెట్ విషయానికి వచ్చే సరికి రెండు, మూడు ఆప్షన్లు కలిగి ఉన్న ఏకైక రాజకీయ పార్టీగా తెలంగాణలో తనకంటూ సుస్థిర స్థానం ఏర్పరచుకున్నది.

### పార్టీలు మారేటోళ్లతో నష్టం లేదు..

అధికార దాహం, కనీస నైతిక విలువలు, రాజకీయ చైతన్యం, జనం ఏం అనుకుంటారో అనే ఆలోచన, ప్రజాస్వామ్యం అంటే గౌరవం లేని కొందరు నాయకులకు రాజకీయ భిక్షపెట్టి, సీనియార్టీని గౌరవించి పదవులు, ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చిన తల్లి వంటి పార్టీని వదిలి అధికార పార్టీలో చేరేవారితో బీఆర్ఎస్‌కు వచ్చే నష్టం ఏం లేదన్నది సుస్పష్టంగా గోచరిస్తున్నది. ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరే కొందరు నాయకులను పట్టించుకోవాల్సిన అవసరం లేదని పార్టీ అధినాయకత్వం ధీమాగా చెప్పడం వెనక ఓ కారణం ఉంది. పదవులు, అధికారం కోసం పార్టీ మారే వారు పోయినా.. ఉద్యమకాలం నుంచి పార్టీనే నమ్ముకున్న నాయకులు ఇంకా స్థిరంగా బీఆర్ఎస్‌లోనే ఉన్నారు. ఇప్పుడు పార్టీ ఫిరాయించిన నాయకత్వానికి ప్రత్యామ్నాయంగా పదుల మంది నాయకులు బీఆర్ఎస్‌లో ఉన్నారు. నాయకత్వం లేదని బీఆర్ఎస్ ఖాళీ అవుతుందని ఉద్దేశపూర్వకంగా రాజకీయాలే చేసే వారికి సమాధానం చెప్పేందుకు బీఆర్ఎస్‌లోని నాయకత్వం సిద్ధంగా ఉన్నది.


బీజేపీ ఎంపీ గొడం నగేశ్ ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న నాయకులకు అరెస్టు చేస్తున్న పోలీసులు

## ఎంపీ నగేశ్ ఇంటి ముట్టడి

ఎదులాపురం, జూన్ 26 : నీట్ పరీక్షలో జరిగిన అవకతవకల కారణంగా లక్షలాది మంది విద్యార్థులకు అన్యాయం జరిగిందని, ఈ విషయాన్ని పార్లమెంట్‌లో చర్చించకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం ఎంపీ గొడం నగేశ్ ఇంటిని విద్యార్థి సంఘాల నాయకులు ముట్టడించారు. ఎంపీ ఇంటి ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు వారిని నియంత్రించే క్రమంలో కొంత ఉద్రిక్తత వాతావరణం నెలకున్నది. పోలీసులు విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేసి వన్ టౌన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు శంతన్ రావు మాట్లాడుతూ.. నీట్ పరీక్షను సక్రమంగా నిర్వహించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. ఇప్పటికీ పరీక్షలో ఎవరికీ 100 శాతం మార్కులు రాలేదని పేర్కొన్నారు. ఈ నెల14 రావాల్సిన ఫలితాలను పార్లమెంట్ ఎన్నికల ఫలితాల రోజు 4వ తేదీన విడుదల చేసి తప్పిదాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నప్పటికీ పార్లమెంట్‌లో ఈ అంశాన్ని ఎంపీలు లేవనెత్తక పోవడం విడ్డూరమన్నారు. నీట్ పరీక్షను రద్దు చేయడంతోపాటు ఎన్‌టీఏపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడవి గణేశ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు దిగంబర్, మాస్‌లైన్ పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు మహేందర్, జిల్లా అధ్యక్షుడు హరీశ్, సహాయ కార్యదర్శి దత్తు, పీవైఎస్ జిల్లా నాయకుడు మెస్రం మారుతి, ఎన్ఎస్‌యూఐ నాయకులు కపిల్, అవినాశ్ పాల్గొన్నారు.



బీజేపీ ఎంపీ గొడం నగేశ్ ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

## డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్యలు

**కలెక్టర్ అభిలాష అభినవ్**

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 26 : నిర్మల్ జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల కలిగే నష్టాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ జానకీ షర్మిల మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు అమ్మినా, సరఫరా చేసిన పోలీస్ శాఖ నంబర్ 8712671111 లేదా టోల్ ఫ్రీ నంబర్ 14446 కు సమాచారం అందించాలని కోరారు.



యాంటీ డ్రగ్ సోల్జర్ పాయింట్ వద్ద నిర్మల్ కలెక్టర్, ఎస్పీ

గాహన పోస్టర్లను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకల్యాణి, డీడబ్ల్యూవో నాగమణి, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, డీపీఆర్వో విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

### యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్**

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు తీసిన ర్యాలీని ఆయన జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అవ


ఎదులాపురం : విద్యార్థులతో కలిసి ఫొటో దిగుతున్న ఎస్పీ, ఏఎస్పీలు

### మత్తు జీవితాన్ని చిత్తు చేస్తుంది

**- ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం**

ఎదులాపురం, జూన్ 26 : మత్తు పదార్థాల వినియోగం వల్ల జీవితాలు నాశనమయ్యే ప్రమాదం ఉందని, వాటి వల్ల కలిగే దుష్పరిణామాలను గుర్తించి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి పాటుపడాలని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భం గా ఆదిలాబాద్ పట్టణంలోని కలెక్టర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తీసిన ర్యాలీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జీవితంలో డ్రగ్స్‌కి దూరంగా ఉంటూ ఉన్నతమైన భవితను సాధిస్తానని ప్రతిజ్ఞ చేయించారు. యాంటీ డ్రగ్ సోల్జర్ అనే ఫొటో పాయింట్ వద్ద ఫొటోలు దిగారు. అనంతరం జెండా ఊపి ర్యాలీ ని ప్రారంభించారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిస్తామంటూ నినాదాలు చేస్తూ విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ గౌ ష్ ఆలం మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది ద్వా రా యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీలు జీవన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, డీసీపీవో రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల ధర్నా

ఎదులాపురం, జూన్ 26 : సీఐటీయూ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం సరైన సమయంలో వేతనాలు అందించడం లేదని మండిపడ్డారు. జీవో నంబర్ 60, 63లలో నిర్ణయించిన విధంగా వేతనాలు అమలు చేయాలని కోరారు. మల్టీ పర్పస్ విధానాన్ని అమలు చేసి ఉద్యోగ భద్రత లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షులు అగ్గిమల్ల స్వామి, లింగాల చిన్నన్న, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దర్శనాల నగేశ్, గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు సోనేరావు, వెంకట్రావు ఉన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

## కుంటాలను అభివృద్ధి చేస్తాం

- కలెక్టర్ రాజర్షి షా
- హరిత హోటల్ స్థల పరిశీలన
- త్వరలోనే కాటేజీల నిర్మాణం

నేరడిగొండ, జూన్ 26 : కుంటాల జలపాతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. బుధవారం జలపాతాన్ని ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజిరావ్ పాటిల్‌తో కలిసి సందర్శించారు. వ్యూ పాయింట్ వద్ద నుంచి జలపాతాన్ని వీక్షించి పలు విషయాలపై అడిగి తెలుసుకున్నారు. జలపాతం కింది ప్రదేశంలో పర్యాటకులు చూసేందుకు వీలుగా వంతెన నిర్మాణంతోపాటు రోడ్డు సౌకర్యం కల్పిస్తే బాగుంటుందని సూచించారు. జలపాతం కింద ప్రదేశానికి వెళ్లేందుకు అవసరమైన రోడ్డు సౌకర్యం ఏర్పాటుకు అధికారులతో కలిసి చర్చించారు. కింది వరకు రోడ్డు సౌకర్యం కల్పిస్తే సులభంగా పర్యాటకులు వీక్షించడానికి వీలుంటుందని డీఎఫ్‌వో వివరించారు. రోడ్డు నిర్మాణానికి అనుభవమున్న ఇంజినీరింగ్ అధికారులతో ప్లానింగ్ తయారు చేయించాలని అధికారులకు సూచించారు. హరితహోటల్, కాటేజీల నిర్మాణానికి రూ.3.81 కోట్లు మంజూరయ్యాయని, టెండర్లు కూడా పూర్తయ్యాయని గ్రామస్తులు వివరించారు. హరిత హోటల్, కాటేజీలు నిర్మిస్తే పేదలకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని, ఇక్కడి ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశం ఉందని చెప్పారు. అందుకు వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేలా చూడాలని కలెక్టర్‌ను వేడుకున్నారు. తప్పకుండా నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ముందుగా జలపాతం వద్ద డీఎఫ్‌వోతో కలిసి మొక్క నాటారు. ఇందులో ఆర్డీవో వినోద్ కుమార్, ఐఈడీఏ ఈఈ భీంరావ్, ఏఈ శేఖర్, సుధాకర్, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఆర్ఐ నాగారావ్, సర్వేయర్ శంకర్, ఎఫ్ఆర్వో గణేశ్, ఎఫ్ఎస్‌వో వసంత్‌కుమార్, ఎఫ్‌బీవో సచిన్, భీంజీ, మాజీ సర్పంచ్ అశోక్ పాల్గొన్నారు.


జలపాతం వద్ద కలెక్టర్ ఆదిలాబాద్ రాజర్షి షా